క్లుప్తంగా

108, 102 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



కమలాపూర్ : వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున 108, 102 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 108, 102 అంబులెన్సుల వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని 108, 102 అంబులెన్సులను శుక్రవారం తనిఖీ చేశారు. అంబులెన్సుల్లోని పరికరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో 108 పైలట్ కేందారి, ఈఎంటీ ఉపేందర్, 102 కెప్టెన్ తిరుపతి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



కమలాపూర్ : మండలంలోని గుండేడుకు చెందిన మంద రవీందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతనితోపాటు హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుకున్న 1996–98 బ్యాచ్‌కు చెందిన మిత్రబృందం శుక్రవారం పరామర్శించింది. ఈ సందర్భంగా రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. గిన్నారపు సురేందర్, రామగిరి సంపత్, కుమార్, సరస్వతి, రజిత, శ్రీదేవి, తేలు విజయ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ తొలగింపు

నడికూడ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

నేటి సదరం క్యాంపును వినియోగించుకోవాలి

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలో నేడు (శనివారం) నిర్వహించనున్న సదరం క్యాంపును ఆర్థో, మానసిక విభాగాలకు సంబంధించిన దివ్యాంగులు వినియోగించుకోవాలని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సంపేట డివిజన్‌లోని నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపూర్, నల్లబెల్లి, నెక్కొండ మండలాలతోపాటు పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ మండలానికి చెందిన దివ్యాంగులకు జిల్లా ఆస్పత్రిలో క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట సీహెచ్‌సీకి స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు సైతం క్యాంప్‌కు హాజరు కావాలని సూచించారు. దివ్యాంగులు స్లాట్ రసీదు, వైద్యానికి సంబంధించిన వైద్యుడి చీటీలు, ఎక్స్‌రే రిపోర్టులు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, ఫొటోలు వెంట తీసుకుని ఉదయం 10 గంటల వరకు ఆస్పత్రికి రావాలని తెలిపారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి'

నల్లబెల్లి : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి కోరారు. మండలంలోని మేడపల్లిలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు సుభిక్షంగా ఉండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరువు కోరల్లో చిక్కుకున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ, మోసపూరిత పాలనతోనే పల్లెలో సాగునీటి సమస్య నెలకొందని చెప్పారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని, రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనకు వ్యతిరేకంగా నేడు (శనివారం) ఉదయం పట్టణంలో నిర్వహించనున్న రైతు నిరసన దీక్షకు రైతులు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నర్సంపేట రూరల్ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని ముత్తోజిపేట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటకు గోగు కుమారస్వామికి చెందిన గేదె మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. నీళ్లు తాగేందుకు కొమ్మాయిగూడెం చెరువులోకి దిగింది. ఈ క్రమంలో రైతులు నీళ్లు పారించేందుకు చెరువులో మోటార్ల కోసం వేసిన ఉంచిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- జిల్లా వ్యాప్తంగా జయంతి ఉత్సవాలు
- పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అధికారులు



ఎల్కతుర్తి : పూలమాల వేస్తున్న నాయకులు



శాయంపేటలో..

ఎల్కతుర్తి : భారత దేశ దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు, అధికారులు కొనియాడారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంపీపీ జక్కుల అనీత కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఎల్కతుర్తి బస్టాండ్ సమీపంలో దళిత సంఘం, అంబేడ్కర్ సంఘం నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ మాజీ ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ముల్కనూరు ఎస్సై సాయిబాబు, ఎంపీటీసీ రమాదేవి, నాయకులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కరుణాకర్, సారయ్య, శ్రీనివాస్, సదానందం, సురేష్, మొగిళి, చిరంజీవి, నరేష్, దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మాజీ ఉప ప్రధానమంత్రి డా.బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ డా.బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజేందర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండల కేంద్రంలోని తెలంగాణతల్లి సెంటర్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆ సంఘం నాయకుడు చింత అశోక్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో దళితుల హక్కులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పొందుపరిస్తే వాటిని అమలు చేసేందుకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మర్చిపోలేనిదని కొనియాడారు. ఎస్సై నర్సింగరావు, ఎంపీటీసీ శోభ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతిసాగర్, వివిధ పార్టీల నాయకులు విజయరావు, ప్రసాద్, రాజు, యుగేందర్, ఏలియా, రవీందర్, ప్రదీప్‌కుమార్, ప్రశాంత్, రాజు ,రమణాకర్, శ్రీనివాస్, దయాకర్, రోహిత్, సిద్ధు, సుమంత్, బాలరాజు, సదానందం, వెంకటేశ్, కిషన్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : భారతదేశ ఉప ప్రధానమంత్రిగా బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని ఎంపీఓ రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎంపీఓ రంజిత్‌కుమార్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరకాలలో..

పరకాల : బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కన్వీనర్ బొచ్చు అనంత్, కాంగ్రెస్ నాయకులు సోదా రామకృష్ణ, గూడెల్లి సదన్‌కుమార్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, బుర్ర దేవేందర్ గౌడ్, బొమ్మకంటి చంద్రమౌళి , పర్నెం మల్లారెడ్డి పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



ధర్మసాగర్ : మాట్లాడుతున్న శ్రీనివాస్



ఐనవోలులో..

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శాయంపేట : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మదీనా మజీద్‌లో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఉపవాసంఉన్న ముస్లింలకు స్వీటు తినిపించి విరమింపజేశారు. మతగురువు అబ్దుల్లా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు రాజ్‌మహ్మద్, అంకుశావళి, రఫీ, కరీం, సర్వర్, కమ్రుద్దీన్, అజీమొద్దీన్ పాల్గొన్నారు.

'క్రోధి'లో దైవారాధనతోనే సుఖశాంతులు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటాచార్యులు

నర్సంపేట : రానున్న క్రోధి నామ సంవత్సరంలో దైవారాధనతోనే ప్రజలకు సుఖశాంతులు లభించగలవని ప్రముఖ సిద్ధాంతి వెంకటాచార్యులు తేటతెల్లం చేశారు. శ్రీమాన్ ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ సంపన్ముడుంబై వెంకటాచార్యులు గణించిన శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధరణిశ్రీ ఫౌండేషన్ సౌజన్యంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమాచార్యులు, మాధవాచార్యులు, రామానుజాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి వెంకటాచార్యులు మాట్లాడారు. క్రోధి నామ సంవత్సర ఫలితాలను వివరించారు. కుటుంబాల్లో విరోధాలు తలెత్తుతాయని చెప్పారు. రాజకీయ నాయకుల్లో విభేదాలతో పరిపాలన అస్తవ్యస్తం అవుతుందని తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉంటుందని, మే నెలలో అకాల వర్షాల వల్ల వ్యవసాయదారులు పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. ఏప్రిల్ నుంచి కర్షకులకు కొంత మేలు జరుగుతుందన్నారు. కరువు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. పరిశ్రమలు, వ్యవసాయదారులకు, ఉద్యోగస్తులు, చేతి వృత్తితో జీవితం గడిపే వారికి స్వల్ప లాభం ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంచాంగాన్ని గణించడం జ్యోతిష్య పండితులైన వెంకటాచార్యులకే సాధ్యమని కొనియాడారు. ఆలయ పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. కార్యదర్శి రంగనాథ్‌స్వామి మాట్లాడుతూ 200 పంచాంగములు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం వెంకటాచార్యులును ఘనంగా సన్మానించారు. సభ్యులు రేణుక, రూప, లక్ష్మి శ్రీవిద్య, ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్, శ్రీధర్, యాకయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మొరం దందా.. చర్యలు శూన్యం



ధర్మతండా శివారులో మొరం తోడుతున్న జేసీబీ

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, చెన్నారావుపేట, ధర్మతండా తదితర గ్రామాల పరిధిలో మొరం దందా జోరుగా సాగుతోంది. అయినా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ధర్మతండా శివారులో ఓ వ్యాపారి శుక్రవారం అక్రమంగా జేసీబీతో గుట్ట నుంచి ట్రాక్టర్లలో భారీగా మొరం తరలించడం కనిపించిందని, నిత్యం మొరం దందా సాగుతోందని ప్రజలు వాపోతున్నారు. సదరు అక్రమార్కుడు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మొరం తరలిస్తూ ట్రిప్పుకు రూ.800 నుంచి వెయ్యి రూపాయల వరకు చొప్పున సొమ్ము చేసుకుంటున్నాడని బహిరంగంగానే పలువురు విమర్శిస్తున్నారు. అయినా రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులు ప్రభుత్వ శాఖల అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేసి మొరం దందా సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అట్రాసిటి కేసు నమోదు

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన దబ్బెట స్పందన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్త మామలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. మనుగొండకు చెందిన తాను, ధర్మారం గ్రామానికి చెందిన లింగాల కుమార్ ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్ తల్లిదండ్రులు వివాహాన్ని అంగీకరించకపోవడంతో తాము మనుగొండలోనే నివాసం ఉన్నట్టు తెలిపారు. ఇటీవల కుమార్‌తోపాటు అతడి తల్లిదండ్రులు దళితురాలివంటూ కులం పేరుతో దూషించి జుట్టుపట్టుకుని కొట్టినట్టు ఆమె ఫిర్యాదులో వివరించారు. కేసును మామునూరు ఏసీపీ తిరుపతి దర్యాప్తు చేస్తున్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణ మహోత్సవం

రామన్నపేట: వరంగల్ నగరంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ వేడుకలు నాలుగు రోజులుగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. కల్యాణ తంతును వివరిస్తూ వేద మంత్రోచ్చరణల మధ్య వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, తోట నవీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



కావ్యను కలిసిన కార్పొరేటర్లు

హసన్‌పర్తి: వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత, జన్ను షీబారాణి, అనిల్, అరుణవిక్టర్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మజ్జిగ పంపిణీ' ప్రారంభం



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

వరంగల్ అర్బన్: అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్యవైశ్య మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు బీట్‌బజార్‌లో కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలం మొత్తం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్ర బృందం ప్రతినిధులు మోహన్‌రావు, మురళీధర్, కిషన్, సదాశివుడు, రఘుబాబు, ధనలక్ష్మి, సంపూర్ణ, జ్యోతి, పూర్ణ, వాసవి, రాజమణి పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు నిలబెట్టవచ్చు



ఖిలా వరంగల్: వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే గుండెపోటు అనేది సాధారణమైందని, గుండెపోటు వస్తే వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలను నిలబెట్టవచ్చని మెడికేర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేష్, కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో బేగంపేట మెడికేర్ వైద్య బృందం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 453 మంది టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఆస్పత్రి డాక్టర్ అన్వేషిణి, మెడికేర్ వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్, రూబెన్, సతీష్‌కుమార్, ఫార్మసిస్ట్ జలగం రమేష్, వైద్య సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే



కండువా కప్పి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరావు

వేలేరు : పేద ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వివిధ పార్టీల నుంచి 20 మంది కార్యకర్తలు సీపీఐలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూర్జువా పార్టీలకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యలో ఉంటాయని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, జిల్లా నాయకులు భిక్షపతి, మేకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వేలేరు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ధర్మసాగర్ సీఐ మహేందర్ అన్నారు. శుక్రవారం వేలేరు, పీచర గ్రామాల్లో ఎస్సై డి.హరిత ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో గొడవలు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



పీచర గ్రామంలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వేలేరు : అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై డి.హరిత హెచ్చరించారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన బొల్లి రాజు బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. బెల్ట్‌షాపు నుంచి రూ.50 వేల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల నియంత్రణకు ప్రత్యేక దృష్టి వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐనవోలు : మండలంలోని ముల్కలగూడెం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మల తొలిగింపు, లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెం గృహ అవసరాల కనెక్షన్లు పొందిఉన్న వినియోగదారులతో పాటు వ్యవసాయ కనెక్షన్లు కలిగిన వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

వేలేరు : మండలంలోని పీచర, మల్లికుదుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ ఫేజ్ సరఫరా ఉంటుందని తెలిపారు.

నడికూడ : మండలంలోని చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, రాయపర్తి, నర్సక్కపల్లి గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ కె.విశ్వప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : నేడు తుక్కుగూడలో నిర్వహించతలపెట్టిన జనజాతర సభకు మండల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. రెండు రోజులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజీనామా చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేసిన తర్వాతే బీఆర్‌ఎస్‌లోకి తీసుకున్నారా అని ప్రశ్నించారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేదిలేదని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, లక్ష్మన్‌నాయక్, సలీంమాలీక్, సంపత్, శంకర్ పాల్గొన్నారు.

'నిరసన'కు తరలిరావాలి

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు నేడు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేపట్టనున్న రైతు నిరసన దీక్షకు రైతులు, బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు ఎకరానికి రూ.15000 రైతు భరోసా, వరికి కనీస మద్దతు ధర రూ. 2500, అన్ని పంటలకు రూ. 500 బోనస్ వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో నేడు హనుమకొండ శరత్ కంటివైద్యశాల ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీఏసీ సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.